సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం, 3, అక్టోబర్, 2024



సోమశిలలో 53.207 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 53.207 టీఎంసీలు ఉన్నాయి. 6,524 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నార్ డెల్టాకు 1005, ఉత్తరకాలువకు 540, దక్షిణకాలువకు 10,005 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,216
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.7,103
3 శాతం జీఎస్టీతో	రూ.7,316
నవర (8 గ్రా)	రూ.58,528

గరిష్టం/కనిష్టం
40.7 /27.1

వాతావరణం

జిల్లాలో గురువారం వాతావరణం అక్కడకక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. చిరు జల్లులు కురిసే అవకాశం. గాలిలో తేమ 54 శాతం ఉంది.

తమ్ముళ్లు.. సిండికేట్లు

ప్రైవేట్ మద్యం పాలసీతో రంగంలోకి దిగిన ఎమ్మెల్యేలు, షాడోలు

- వారు సూచించిన వారే దరఖాస్తులు చేసుకోవాలని హుకుం
- ఔత్సాహికులను బెదిరిస్తున్న వైనం
- జిల్లాలో 182 మద్యం దుకాణాల ఏర్పాటు
- ఆన్‌లైన్, పారదర్శకత అంటూ తమ్ముళ్ల గుత్తాధిపత్యంలోకి మద్యం దుకాణాలు
- దరఖాస్తుల ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రైవేట్ మద్యం పాలసీ పేరుతో కూటమి ప్రభుత్వం తమ్ముళ్లకు రూ.కోట్లు దోచి పెట్టేందుకు ప్లాన్ సిద్ధం చేసింది. ప్రభుత్వ పెద్దల అండదండలు, సూచనలతోనే దుకాణాలు దక్కించుకునేందుకు సిండికేట్లుగా మారారని తెలుస్తోంది. నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, షాడోలు చెప్పిన వారే దరఖాస్తులు చేయాలని ఇప్పటికే లిస్ట్ సిద్ధం చేసినట్లు సమాచారం. ఔత్సాహికులు ఎవరైనా దరఖాస్తు చేస్తే ఆదాయ పన్ను శాఖలతో దాడులు చేయిస్తామని బెదిరిస్తున్నారు. ఒక వేళ లక్కీ డిప్‌లో దుకాణం దక్కినా.. నితంతరం ఎక్సైజ్ అధికారులతో తనిఖీలు చేయించి వేధింపులకు గురి చేయక తప్పదంటూ కనీసం దరఖాస్తు కూడా చేయనీయకుండా హెచ్చరికలు జారీ చేస్తున్నారు.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇసుక, మట్టి, గ్రావెల్, సహజ వనరులను యథేచ్ఛగా దోపిడీ చేస్తున్న టీడీపీ నేతలు మద్యం దుకాణాలపై కన్నేశారు. టీడీపీ నేతలు తప్ప.. మరెవరి చేతుల్లోకి దుకాణాలు వెళ్లకూడదనే ప్లాన్‌తో సిండికేట్లుగా మారారు. ప్రస్తుత పరిస్థితుల్లో గతంలో మద్యం వ్యాపారం చేసిన ఇతర పార్టీల నేతలు, ఔత్సాహిక వ్యాపారులు దరఖాస్తులు వేసేందుకు సైతం వెనుకాడుతున్నారు. గత ప్రభుత్వం మద్యం విధానాన్ని పారదర్శకంగా అమలు చేస్తే.. కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌కు అప్పగించేందుకు శ్రీకారం చుట్టింది.

ఎమ్మెల్యేలు, షాడోల కనుసన్నల్లో..

జిల్లాలో గతంలో 193 ప్రభుత్వ మద్యం షాపులు ఉండగా ప్రస్తుతం 182 ప్రభుత్వ మద్యం షాపులకు ఈ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. నియోజకవర్గాల్లో ఎవరూ షాపులకు దరఖాస్తు చేసుకోవద్దని, తాము సూచించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, మద్యం వ్యాపారులకు షాడో ఎమ్మెల్యేలు హెచ్చరికలు జారీ చేశారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ఓ షాడో ఎమ్మెల్యే ఎవరు షాపు దక్కించుకున్నా.. 20 శాతం వాటా ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ ఆదాయానికి గండి

సిండికేట్ల వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం నాలుగు స్లాబ్‌ల్లో లైసెన్సు ఫీజులను ప్రభుత్వం నిర్దేశించింది. 10 వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.50 లక్షలు, 50 వేల వరకు రూ.55 లక్షలు, 5 లక్షల వరకు రూ.65 లక్షలు, ఐదు లక్షలపైబడి జనాభా కలిగిన ప్రాంతాల్లో రూ.85 లక్షలు లైసెన్సు ఫీజుగా నిర్ణయించారు. దరఖాస్తు ఫీజు రూ 2 లక్షలు. అయితే ఇది నాన్ రీఫండబుల్ మొత్తం. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా వేసుకునే వెసులుబాటు కల్పించింది. జిల్లా వ్యాప్తంగా 11 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 182 మద్యం దుకాణాలకు అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తే ప్రభుత్వానికి ఆదాయం ఉంటుంది. అయితే సిండికేట్లతో ప్రతి మద్యం షాపునకు ఇద్దరు ముగ్గురితోనే దరఖాస్తులు చేయించేందుకు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. లక్కీడిప్‌లో ఎవరి పేరుతో దుకాణం వచ్చినా.. అందరూ కలిసి వ్యాపారం కొనసాగించుకోవాలని వ్యూహంతో టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారు.

ప్రైవేట్ చేతికే మద్యం

గత ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించడంతో ప్రైవేట్ లిక్కర్ మాఫియాకు అడ్డుకట్ట పడింది. బెల్టు షాపులు నిర్వీర్యమైపోయాయి. అడ్డగోలు అమ్మకాలకు తెరపడింది. తాజాగా మళ్లీ ప్రైవేట్‌కు మద్యం దుకాణాలు కేటాయించడంతో పాత విధానంలోనూ ఊరూరా బెల్టు దుకాణాలు పెట్టి వ్యాపారాన్ని విస్తరించేందుకు సిద్ధమవుతున్నారు. క్వార్టర్ రూ.99కే అంటూ కూటమి ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. గతంలో ప్రైవేట్ వ్యక్తుల చేతిలో మద్యం దుకాణాలు ఉండడంతో బాటిల్‌పై రూ.20 అత్యధికంగా అమ్మకాలు చేశారని మందుబాబులు గుర్తు చేస్తున్నారు.



గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా మహిళలు

మద్యం పాలసీపై మహిళల కన్నెర్ర

- గాంధీ విగ్రహం సాక్షిగా మద్యం బాటిళ్లు ధ్వంసం
- ఆకాశాన్నంటిన నిత్యావసరాలు, కూరగాయలు, నూనెల ధరలు
- ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని గాలికి వదిలేశారు
- ఆఫర్లు పెట్టి మద్యం షాపులు పెంచడం దుర్మార్గం

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తెచ్చిన ప్రైవేట్ మద్యం పాలసీపై మహిళలు కన్నెర్ర చేశారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని నూతన మద్యం పాలసీను రద్దు చేయాలని, మద్యాన్ని దశల వారీగా నియంత్రించి, బెల్ట్ షాపులను అరికట్టాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన చేపట్టారు. నగరంలోని పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ చేపట్టారు. గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసన తెలిపి, గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మద్యం బాటిళ్లను పగులకొట్టి నిరసనను వ్యక్తం చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమారి, మస్తాన్‌బీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఒక్క హామీని కూడా ఇంత వరకు నెరవేర్చకుండా రూ.99కే మద్యం విక్రయ నిర్ణయాన్ని కేబినెట్ ఆమోదించడం సిగ్గు చేటని దుయ్యబట్టారు. ఆఫర్లు పెట్టి, మద్యం షాపులు పెంచి, బెల్టు షాపుల ను తెరిపించి మద్యం తాగించి ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటూ, మహిళల మాన, ప్రాణాలకు నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నా రు. విద్య, వైద్యం, ఉపాధి అంశాలపై దృష్టి పెట్టకుండా, ఉచిత పథకాలపైనా రాజకీయాలు చేస్తూ, మద్యం అమ్మకాలను ఆదాయ వనరులుగా చూడ దం విచారకరమన్నారు. రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరల అదుపుపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. వంద రోజుల్లో ఏ కుటుంబానికి ఏ రూపంలోనూ మేలు చేయలేని అసమర్థ ప్రభుత్వం 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ ఇంటింటికి స్టిక్కర్లు అతికించటం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన వంద రోజు లు మహిళల కన్నీళ్లతో సంబరాలు చేసుకుంటున్నార ని మండిపడ్డారు. మద్యం కట్టడికి చర్యలు తీసుకోకపోతే మద్యానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసేందుకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌వీ సుబ్బమ్మ, కత్తి పద్మ, మహ్మదా, సంపూర్ణ, షాహిన్, లక్ష్మి, వెంకటేశ్వరమ్మ, మస్తానమ్మ, శిలారమ్మ, భార్గవి, భాగ్యమ్మ, కొండమ్మ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు జిల్లా విజన్‌ప్లాన్ వర్క్‌షాప్

నెల్లూరు(దర్గామిట్ట): స్వర్ణాంధ్ర–2047లో భాగంగా జిల్లా, మండల విజన్ ప్రణాళికకు సంబంధించి గురువారం స్థానిక శ్రీవెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఓ ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వర్క్ షాపు జరుగుతుందని జిల్లాలోని రైతు సంఘాలు, ఎన్‌జీఓలు, వ్యాపార వాణిజ్య సంఘాలు, విద్యావేత్తలు, ఆర్థికవేత్తలు, ప్రముఖ వ్యక్తులు తమ విలువైన సలహాలు, సూచనలు ఇచ్చి రాబోయే 5 ఏళ్లకు జిల్లా విజన్ ప్రణాళిక తయారు చేయడానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.


నేటి నుంచి టెట్

- 4 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ.. ఏర్పాట్లు పూర్తి
- హాజరుకానున్న 9350 మంది అభ్యర్థులు
- డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు

నెల్లూరు (టౌన్): టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్)కు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండు విడతల్లో ఆన్‌లైన్‌లో పరీక్షను నిర్వహించనున్నారు. జిల్లాలో 10 వేల మందికి పైగా అభ్యర్థులు హాజరుకానున్నారు. హాల్ టికెట్లు http:// cse. ap. gov. in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు గంటన్నర ముందుగా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంది. కావలిలోని పీబీఆర్ విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాల, ఆర్‌ఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, పొట్టిపాళెం ఆయాన్ డిజిటల్ సెంటర్లల్లో జరగనుంది. డీఈఓ కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులు తమతో పాటు గుర్తింపు కార్డును తప్పని సరిగా తీసుకరావాల్సి ఉంది. దివ్యాంగ అభ్యర్థుల కోసం స్క్రైబ్స్ ఏర్పాటు చేయనున్నారు. వీరికి 50 నిమిషాలు అదనపు సమయం కేటాయించనున్నారు. హాల్ టికెట్‌లో తప్పులు ఉన్నట్లయితే పరీక్ష కేంద్రంలో డిపార్ట్‌మెంట్ అధికారి దగ్గర ఉన్న నామినల్ రోల్స్‌లో సరిపోయిన ఆధారాలు చూపించి సరి చేయించుకునే అవకాశాన్ని కల్పించారు.

పకడ్బందీగా పరీక్షలు

టెట్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు రాష్ట్ర పరిశీలకులుగా నాగేశ్వరరావు నియమితులయ్యారు. పరీక్ష కేంద్రాలకు డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. పీబీఆర్ విశ్వోదయ కళాశాలకు కావలి ఎంఈఓ–2 వెంకటసుబ్బయ్య, ఆర్‌ఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు బోగోలు ఎంఈఓ–2 జయమ్మ, నారాయణ ఇంజినీరింగ్ కళాశాలకు నెల్లూరు అర్బన్ ఎంఈఓ–2 అబ్దుల్‌హమీద్, ఆయాన్ డిజిటల్ సెంటరుకు నెల్లూరు రూరల్ ఎంఈఓ–2 మురళీధరరావు, కొడవలూరు ఎంఈఓ–2 అంకయ్యలను నియమించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లో నెల్లూరు డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మీ, కావలి డిప్యూటీ డీఈఓ రఘురామయ్యను అధికారులుగా నియమించారు.



రాజేశ్వరి అమ్మవారి ఆలయం



రాజేశ్వరి అమ్మవారి ఆలయంలో లోపలి వైపు





కన్యకా పరమేశ్వరి ఆలయం

- నేటి నుంచి దసరా మహోత్సవాలు
- అలంకార వేడుకలకు ఆలయాలు ముస్తాబు
- దేవీ నవరాత్రుల ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
- విద్యుత్ దీపాలతో మండపాల అలంకరణ

సింహపురికి శరన్నవ రాత్రి శోభ

సింహపురి శరన్నవ రాత్రి శోభను సంతరించుకుంది. దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు గురువారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి.తొమ్మిది రోజుల పాటు జరిగే దసరా ఉత్సవాలకు సింహపురి ముస్తాబైంది. నగరంలోని రాజరాజేశ్వరిదేవి, ఇరుకళల పరమేశ్వరిదేవి, కన్యకాపరమేశ్వరి, శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి తదితర ఆలయాల్లో ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే దేవీ నవరాత్రుల కోసం అమ్మవారి ఆలయాల్లో వేడుకలకు అవసరమైన ఏర్పాట్లును నిర్వాహకులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఆలయాలతో పాటు పరిసరాలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. – నెల్లూరు(బృందావనం)

జాతిపిత జగతికే ఆదర్శం



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గాంధీజీ, లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (బారకాసు): బ్రిటిష్ బానిసత్వం నుంచి స్వాతంత్ర్యం సాధించడంలో ముఖ్య భూమిక పోషించిన జాతిపిత మహాత్మాగాంధీ జగతికే ఆదర్శమని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీజీతో పాటు లాల్‌బహదూర్‌శాస్త్రీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రామ స్వరాజ్యం వైపు వైఎస్ జగన్ అడుగులు

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం వైపు అడుగులు వేసిన ఏకైక నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలియజేశారు. భారతదేశ చరిత్రలో ఎన్నడూ, ఎక్కడా లేనటు వంటిది గ్రామ సచివాలయ వ్యవస్థను వైఎస్ జగన్ తీసుకొచ్చి గ్రామస్తులకు తమ గ్రామంలోనే అన్ని సేవలు అందుబాటులో అందేలా ఒక నూతన వ్యవస్థకు నాంది పలికారన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే నిజమైన నివాళి

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (దర్గామిట్ట): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే జాతిపిత మహాత్మాగాంధీకు అసలైన నివాళి అవుతుందని కలెక్టర్ ఓ ఆనంద్ అన్నారు. మహాత్మాగాంధీ జయంతి స్వచ్ఛ భారత్‌దివస్ సందర్భంగా స్వచ్ఛత హీ సేవ ముగింపు కార్యక్రమాన్ని బధవారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జేసీ కార్తీక్, నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ ఆనంద్ జ్యోతి ప్రజ్వలన చేసి, బాపూజీ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం స్వచ్ఛత హీ సేవ ప్రతిజ్ఞను కలెక్టర్ చేయించారు. ఇటీవల జరిగిన విజయవాడ వరద సహాయ కార్యక్రమాల్లో నెల్లూరు జిల్లా నుంచి 600 మంది పారిశుద్ధ్య కార్మికులు వెళ్లి తమ సేవలందించారన్నారు. వారితో పాటు స్వచ్ఛత హీ సేవలో విశేష సేవలు అందించిన పలువురు ఎంపీడీఓలను కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో డీపీఓ సుస్మిత, జెడ్పీ సీఈఓ ఖాదర్‌బాషా, సర్వశిక్ష ఏపీఓ ఉషారాణి, డ్వామా, ఐసీడీఎస్ పీడీలు గంగాభవాని, హేనాసుజన్‌తో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు డాక్టర్ పీ రామకృష్ణ, సీహెచ్ రమణయ్య, పీవీ నర్సారెడ్డి, శివప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

- ఏసీబీ అధికారులమంటూ బెదిరింపు
- రూ.5 లక్షల డిమాండ్
- రూ. 3.5 లక్షలు ఇచ్చిన తహసీల్దార్ రమణారావు
- పోలీసులకు ఫిర్యాదు

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో తహసీల్దార్

చేజర్ల: చేజర్ల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఏవీ రమణారావు సైబర్ నేరగాళ్ల వలలో ఇరుక్కున్నారు. ఏసీబీ అధికారులమంటూ రూ. 5 లక్షలు ఇవ్వాలని బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఆందోళన చెందిన తహసీల్దార్ రూ.3.5 లక్షల నగదును ఇచ్చారని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నెల క్రితం జరిగిన ఈ వ్యవహారంపై తాజాగా పదిహేను రోజుల క్రితం ఆయన సంగం పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కేసు వివరాలు బయటకు వెల్లడి కాలేదు. ఆదివారం సోషల్ మీడియాలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తహసీల్దార్ ఏవీ రమణారావుకు నెల క్రితం ఏసీబీ అధికారులమని సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసిరూ.5 లక్షలు ఇవ్వాలని, లేదంటే మీ అక్రమార్జన బయట పెడతామని బెదిరించారు. మరో నెల రోజుల్లో ఉద్యోగవిరమణ చేయనున్న ఆయన ఏసీబీ అధికారులనే సరికి బయపడి అంత ఇవ్వలేనంటూ రూ.3.50 లక్షలు ఇచ్చినట్లు సమాచారం. దీనికి సైబర్ నేరగాళ్లు ఒప్పుకోకపోకపోగా, వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో పదిహేను రోజుల క్రితం తహసీల్దార్ సంగం సీఐ వేమారెడ్డికి ఫిర్యాదు చేశారు. అయితే ఈ విషయాన్ని పోలీసులు రహస్యంగా ఉంచి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా తహసీల్దార్ సైబర్ నేరగాళ్లకు రూ.3.5 లక్షలు సమర్పించాడంటే.. ఎన్ని రూ.కోట్లు సంపాదించాడో అంటూ రెవెన్యూ అధికారులు, ప్రజలు గుసగుస లాడుకొంటున్నారు.



తహసీల్దార్ ఏవీ రమణారావు

క్లుప్తంగా

మైపాడులో భారీ దొంగతనం

- 30 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

ఇందుకూరుపేట: గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లోకి చొరబడి 30 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు, 470కు పైగా అమెరికన్ డాలర్లను అపహరించారు. ఈ ఘటన మండలంలోని మైపాడులో జరిగింది. బాధితులు, పోలీసులు బుధవారం వివరాలు వెల్లడించారు. కె.కోటయ్య మైపాడులో ఆర్‌ఎంపీగా ఉన్నాడు. సుమారు 20 రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని పొరుగింటి వారు మంగళవారం కోటయ్యకు ఫోన్ చేసి తెలియజేశారు. ఆయన కుటుంబంతో బుధవారం మైపాడుకు చేరుకున్నాడు. ఇంట్లోని వస్తువులు, దుస్తులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. బంగారు ఆభరణాలు, నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది.

వృద్ధురాలి ఇంట్లో నగదు, బంగారం చోరీ

కలిగిరి: మండలంలోని వెలగపాడు పంచాయతీ కమ్మవారిపాళెంలో పొన్నగంటి అంకమ్మ అనే వృద్ధురాలి ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. అంకమ్మ, ఆమె కుమార్తె మహాలక్ష్మమ్మ మంగళవారం రాత్రి ఇంటి వరండాలో నిద్రించారు. తాళాన్ని అంకమ్మ దిండు కింద పెట్టింది. గుర్తుతెలియని దుండగులు తాళం తీసుకుని ఇంటి తలుపులు తీసి లోపలికెళ్లారు. బియ్యం డబ్బాలో ఉన్న రూ. లక్ష నగదు, 6 సవర్ల విలువైన బంగారు సరుడు, జత కమ్మలు, రెండు ఉంగరాలు చోరీ చేశారు. వస్తువులను చిందరవందరగా పడేశారు. బుధవారం ఉదయం అంకమ్మకు నగదు, బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై ఉమాశంకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నెల్లూరు నుంచి వచ్చిన క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది.

వంతెన నిర్మించాలంటూ నిరసన

- రెండు గంటలపాటు రాకపోకల బంద్
- సబ్ కలెక్టర్ హామీతో విరమించిన వైనం



నిరసన తెలుపుతున్న కొండముడుసుపాళెం గ్రామస్తులు

కందుకూరు రూరల్: మండలంలోని కొండముడుసుపాళెం ఎర్రవాగు సమీపంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలంటూ కొండముడుసుపాళెం గ్రామస్తులు బుధవారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరాయకొండ నుంచి కందుకూరు మీదుగా జాతీయ రహదారి నిర్మాణం జరుగుతోందన్నారు. ఎర్రవాగు సమీపంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని కోరినా పట్టించుకోకుండా పనులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైవే కావడంతో భారీ వాహనాలు తిరుగుతుంటాయని, రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వంతెన నిర్మాణం చేపట్టకపోతే రహదారి పనులు ఆపేస్తామని హెచ్చరించారు. సుమారు రెండు గంటలపాటు రాకపోకలను నిలిపివేశారు. దీంతో సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ వచ్చి బ్రిడ్జి నిర్మాణానికి ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు నిరసన కార్యక్రమాన్ని విరమించారు.

సోమేశ్వరాలయాన్ని సందర్శించిన ఆర్జేసీ



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

సోమశిల: మండలంలోని సోమేశ్వరాలయాన్ని బుధవారం దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ అజాద్ పరిశీలించారు. తొలుత ధర్మకర్తలు, ప్రధానార్చకులు అన్నవరపు రామకృష్ణశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయ పునర్నిర్మాణ మ్యాప్‌ను ఆర్జేసీ పరిశీలించారు. మార్పులు, చేర్పులపై రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో చర్చిస్తానని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ జనార్దనరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రకాష్‌రావు, అసిస్టెంట్ ఇంజినీర్ మురళి, స్థపతి సురేంద్ర, సోమశిల ఏఓ ప్రసాద్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సమాచారమంతా అపార్ కార్డులోనే..

- వన్ నేషన్.. వన్ స్టూడెంట్ ఐడీ విధానం
- ఆధార్ తరహాలో విద్యార్థులకు 12 అంకెలతో కూడిన కార్డులు
- వీటితో ఎన్నో ప్రయోజనాలు
- దేశంలో ఎక్కడైనా సులభంగా చదువుకునే అవకాశం



అపార్ సమ్మతి పత్రాలను విద్యార్థులకు అందించిన ఉపాధ్యాయులు (ఫైల్)

భారత పౌరుడి పుట్టు పూర్వోత్తరాలు ఆధార్‌కార్డులో ఎలా నిక్షిప్తం చేశారో.. ఇకపై విద్యార్థుల వివరాలను ఒకే కార్డులో భద్రపరచనున్నారు. దానిపేరే ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్). జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వ యాజమాన్యాలు, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్డులు అందజేయనున్నారు.

సీతారామపురం: ఉన్నత చదువుల సమయంలో విద్యార్థులకు స్టడీ సర్టిఫికెట్లు అవసరమవుతాయి. మరికొన్ని సందర్భాల్లో చదువుకు సంబంధించి ఇతర ధ్రువీకరణపత్రాలు కావాల్సి వస్తాయి. వీటి కోసం ఎక్కడికెక్కడికో పరుగులు పెట్టాల్సి ఉంటుంది. ఇక నుంచి అలా చేయాల్సిన అవసరం లేదు. కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్, వన్ స్టూడెంట్ నినాదంతో అందుబాటులోకి తీసుకొచ్చిన అపార్ ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది. ప్రత్యేకంగా రూపొందించిన 12 అంకెల గుర్తింపు వ్యవస్థనే అపార్‌గా చెబుతున్నారు. వివరాలన్నీ కార్డులోనే భద్రపరచనున్నారు. దీంతో స్థానికంగానే కాకుండా దేశ విదేశాల్లో విద్యనభ్యసించడం ఇకనుంచి సులభతరం కానుంది. ఈ విధానంతో పిల్లల సంపూర్ణ విద్యాప్రగతి వారి తల్లిదండ్రులకు తెలిసే అవకాశం ఏర్పడనుంది.

ప్రత్యేక ఐడీ

దేశంలోని ప్రతి వ్యక్తికి ఆధార్ గుర్తింపుకార్డును కేంద్ర ప్రభుత్వం అందించింది. అదేవిధంగా ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు యూడైస్ ప్లస్ వెబ్‌సైట్ ద్వారా ప్రతి విద్యార్థి పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ (పెన్) కేటాయించారు. దీని ఆధారంగా విద్యార్థులకు అడ్మిషన్లు, రికార్డు షీట్లు, టీసీలు జారీ చేస్తున్నారు. ఎప్పటికప్పుడు అకడమిక్ పురోగతిని తెలుసుకోవడానికి, విద్యను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి అపార్ ఐడీ ఎంతో దోహదపడనుంది. జాతీయ విద్యావిధానం 2020 ప్రకారం ప్రతి విద్యార్థికి ప్రత్యేక ఐడీని రూపొందిస్తున్నారు. అలాగే డిజిటలైజేషన్, పర్సనలైజ్ లెర్నింగ్, బడిబయట ఉన్న పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం ద్వారా విద్యను సార్వత్రికం చేయడం దీని ప్రధాన ఉద్దేశం.

జిల్లాలో..

పాఠశాలల సంఖ్య :	విద్యార్థుల సంఖ్య :
3,436 (ప్రభుత్వ, ప్రైవేట్ కలిపి)	4 లక్షలకు పైగా..

విద్యాశాఖ చర్యలు

ప్రతి విద్యార్థి ఆయా విద్యాసంస్థల్లో సాధించిన విజయాలు, అకడమిక్ హిస్టరీ, డిజీలాకర్ ఇంటిగ్రేషన్ ద్వారా తీసుకున్న కోర్సులు, గ్రేడ్లు, సర్టిఫికేషన్లు, ఇలా ప్రతి విషయాన్ని శాశ్వతంగా రికార్డు చేయడానికి అపార్ ఐడీ ఉపకరిస్తుంది. దీనిద్వారా విద్యార్థులు వారి అకడమిక్ రికార్డులను ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా యాక్సిస్ చేసుకోవచ్చు. అలాగే విద్యాసంస్థల మధ్య సులభతరంగా బదిలీ చేసుకునే వీలుంటుంది. ఉద్యోగాలు, ఉన్నత చదువులకు దరఖాస్తు చేసుకునే సమయంలో అకడమిక్ రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యే అవకాశం ఉంటుంది. ప్రతి విద్యార్థికి జిల్లాలో అపార్ ఐడీ రూపొందించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పరిధిలో చదువుతున్న వారికి ఐడీని ఆయా విద్యాసంస్థల ద్వారా క్రియేట్ చేయనున్నారు. ప్రస్తుతం 9, 10 తరగతుల విద్యార్థులకు సమ్మతి పత్రాలను అందించారు.

అనుమతి తప్పనిసరి



అపార్ ఐడీ నమూనా

విద్యార్థుల అకడమిక్ డేటా భద్రంగా ఉంచేందుకు, గోప్యత పాటించేందుకు అవసరమైన చర్యలను అధికారులు తీసుకుంటున్నారు. అపార్ ఐడీ విధానాలను అర్హత వినియోగదారుల ద్వారా మాత్రమే అందుబాటులో ఉండేలా భద్రతాపరమైన చర్యలు తీసుకుంటారు. అపార్ ఐడీ జనరేషన్‌కు తల్లిదండ్రులు, సంరక్షకుల సమ్మతి అవసరం. 18 ఏళ్లలోపు విద్యార్థులు మైనర్ అయినందున వారి అనుమతితోనే ఐడీని క్రియేట్ చేస్తారు. దానిని జనరేట్ చేసేందుకు తల్లిదండ్రులు ఇచ్చిన అంగీకార పత్రాన్ని పాఠశాలల్లో భద్రపరుస్తారు. ఆధార్ నంబర్ ఆధారంగా అపార్ ఐడీని క్రియేట్ చేస్తారు. అందువలన ప్రతి విద్యార్థికి ఆధార్ నంబర్ తప్పనిసరి. అపార్ ఐడీ ద్వారా విద్యార్థి సాధించే విజయాలు, అకడమిక్ ఫలితాలు, అభ్యసనా స్థాయి తదితర సమాచారాన్ని ఒక్క క్లిక్‌తో తెలుసుకునే వీలుంటుంది.

ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ తీసుకోండి

- ఖైదీలకు కలెక్టర్ ఆనంద్ సూచన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎంపీ తదితరులు

వెంకటాచలం: ఖైదీలు తమకు ఆసక్తి ఉన్న రంగంలో తప్పనిసరిగా శిక్షణ పొంది వృత్తి నైపుణ్యత సాధించాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా మండలంలోని చెముడుగుంట వద్దనున్న జిల్లా జైలులో వృత్తి నైపుణ్యత శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్, ఎస్పీ కృష్ణకాంత్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఇక్కడ ఖైదీల పనితీరును చూసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖైదీలు ఏదైనా వృత్తిలో నైపుణ్యత సాధిస్తే జైలు నుంచి విడుదలైన తర్వాత స్వయంగా ఉపాధి పొందవచ్చన్నారు. జైల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ శిక్షా కాలం పూర్తయిన తర్వాత తమ కుటుంబాలతో సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలన్నారు. క్షణికావేశంలో చేసే చిన్న తప్పు వల్ల కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమై, పిల్లల భవిష్యత్ గాడి తప్పుతుందన్నారు. ఎంపీ మాట్లాడుతూ గతంలో చెక్కతో తయారు చేసిన తాజ్‌మహల్ బొమ్మను ఒక ఖైదీ తనకు బహుకరించారని, అది ఇప్పటికీ ఇంట్లో ఉందని గుర్తు చేసుకున్నారు. భోజనశాలలో మిక్సీలు, వంట పాత్రలు, ఒక వాహనం, అంబులెన్స్‌ను గతంలో తాము అందించామని తెలియజేశారు. ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తి చేసిన ఖైదీలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రాజారావు, ఏఎస్పీ మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు ఘరానా దొంగల అరెస్ట్

- రూ.4.01 లక్షల సొత్తు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న రూరల్ ఇన్‌స్పెక్టర్ వేణు

నెల్లూరు(క్రైమ్): నలుగురు ఘరానా దొంగలను నెల్లూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.4.01 లక్షల విలువైన సొత్తుతోపాటు నేరాలకు వినియోగించిన కారు, మోటార్‌బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ జి.వేణు నిందితుల వివరాలను బుధవారం వెల్లడించారు. ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన వెంకటేష్, నెల్లూరు పడారుపల్లి చలపతినగర్‌కు చెందిన రౌడీషీటర్ గిరీష్‌కుమార్, వెంకటేశ్వరపురం భగత్‌సింగ్ కాలనీకి చెందిన ఫారూక్ కరిముల్లా, ఏడుకొండలు అలియాస్ రాములు స్నేహితులు. వీరు చెడు వ్యసనాలకు బానిసయ్యారు. వ్యసనాలను తీర్చుకునేందుకు సరిపడా నగదు కోసం నేరాల బాట పట్టారు.

నిందితుల గుర్తింపు ఇలా..

ఈ ఏడాది ఏప్రిల్లో ఇసుక రీచ్‌కు సంబంధించి రూ.9.43 లక్షల నగదును తీసుకెళ్తున్న ఇద్దరు వ్యక్తులను కోడూరుపాడు రోడ్డులోని ఓ రైస్ మిల్లు వద్ద గుర్తుతెలియని వ్యక్తులు కారుతో ఢీకొట్టారు. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వారు కింద పడిపోగా మరో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు నగదు బ్యాగ్‌ను దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు నెల్లూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ జి.వేణు నేతృత్వంలో ఎస్సై ప్రసాద్‌రెడ్డి సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానం, ఘటనా స్థలంలో లభ్యమైన ఆధారాల మూలంగా నిందితులు వెంకటేష్, గిరీష్ కుమార్, కరిముల్లా, ఏడుకొండలుగా నిర్ధారించారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టి బుధవారం అదుపులోకి తీసుకున్నారు. విచారించగా దారిదోపిడీకి పాల్పడినట్లు నిందితులు అంగీకరించారు. గిరీష్‌కుమార్ గతేడాది నవంబర్‌లో నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామంలోని ఓ మహిళ ఇంట్లో బంగారు ఆభరణాలు, రూ.23 వేల నగదును అపహరించినట్లు వెల్లడించారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 28 గ్రాముల బంగారు, సుమారు 75 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.2.01లక్షల నగదు, కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తు విలువ రూ 4.01లక్షలని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పలు కేసులు

గిరిష్‌కుమార్‌పై వేదాయపాళెం, చిన్నబజారు, సంగం పోలీస్‌స్టేషన్లలో పలు కేసులున్నాయని, వేదాయపాళెంలో రౌడీషీట్ ఉందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సిబ్బందికి అభినందన

నిందితులను అరెస్ట్ చేసేందుకు కృషి చేసిన రూరల్ ఎస్సైలు ప్రసాద్‌రెడ్డి, కె.లక్ష్మణరావు, హెచ్‌సీలు ప్రసాద్, పి.ఆదినారాయణ, వేణుగోపాల్, గంగాధర్, కానిస్టేబుళ్లు అల్లాభక్షు, మునికృష్ణ, శ్రీనివాసులు, సతీష్‌ను ఇన్‌స్పెక్టర్ వేణు అభినందించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

తవ్వుకో.. దోచుకో

- అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలింపు
- టీడీపీ నేతల అక్రమాలకు అడ్డేది



అర్ధరాత్రి గ్రావెల్ తరలించి ప్లాట్లలో చదును చేస్తున్న జేసీబీ



కరేడు చెరువు నుంచి ట్రాక్టర్‌లో మట్టి తరలిస్తూ..

ఉలవపాడు: కూటమి ప్రభుత్వంలో ఆ పార్టీ నేతల బరితెగింపు పరాకాష్టకు చేరుకుంది. కరేడు చెరువు వారికి ఆదాయ వనరుగా మారింది. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. వారం రోజులుగా యంత్రాలు ఏర్పాటు చేసి పట్టపగలే యథేచ్ఛగా మట్టిని బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. నీటి పారుదలశాఖ అధికారులు ముఖం చాటేయడంతో టీడీపీ నాయకుల ఇష్టారాజ్యంగా మారింది. రోజుకు సుమారు 500 ట్రిప్పులకు పైగా మట్టి తరలిపోతోంది. నీటి పారుదల శాఖకు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. రాజుపాళెం, వీరేపల్లి చెరువుల నుంచి రాత్రి వేళల్లో గ్రావెల్‌ను ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా భారీగా తరలిస్తున్న సమయంలో అధికారులకు సమాచారం అందించినా ఉపయోగం లేకుండా పోతోంది. అధికార పార్టీ నాయకులు చెరువుల స్వరూపాన్నే మార్చేస్తున్నా.. అడ్డుకట్ట వేసే అధికారులు కరువయ్యారు. చెరువుల నుంచి గ్రావెల్ మట్టి దోచుకుంటున్నా.. అధికారులు ఏ మాత్రం అడ్డుకోకపోగా సహకారం అందిస్తున్నారు. గ్రావెల్, మట్టి తరలిస్తున్న సమయంలో కొందరు స్థానికులు తహసీల్దార్ లావణ్యకు ఫోన్ చేస్తే తనకు కాదని, నీటిపారుదల శాఖ అధికారులకు చెప్పమన్నారు. ఎస్సై అంకమ్మకు ఫోన్ చేస్తే తహసీల్దార్‌కు చేయమని సలహా ఇచ్చారు. నీటిపారుదల శాఖ అధికారులు స్పందించడం లేదు. ఇలా అధికారులు అక్రమ తరలింపును అడ్డుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ జేఈ రమణను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	123
లేయర్ (లైవ్) :	110
బ్రాయిలర్ చికెన్ :	222
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	248
లేయర్ చికెన్ :	187



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి :	రూ.90
సన్నవి :	రూ.50
పండ్లు :	రూ.35



అనారోగ్య సమస్యలతో..

- వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఎంతకీ ఆరోగ్యం కుదుటపడకపోవడంతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పల్లిపాడులో ప్రభాకర్ (40) కుటుంబం నివాసం ఉంటోంది. అతని భార్య మూడేళ్ల క్రితం మృతిచెందింది. తన ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. ప్రభాకర్ మద్యానికి బానిసవడంతో ఆరోగ్యం దెబ్బతింది. దీంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించుకోగా మద్యం తాగితే ఆరోగ్యం మరింతగా క్షీణిస్తుందని వైద్యులు చెప్పారు. అయినా మారలేదు. సోమవారం నెల్లూరులోని ఆస్పత్రికి వచ్చాడు. మద్యం తాగుతుండడంతో ఆరోగ్యం కుదుట పడేందుకు చాలా సమయం పడుతుందని పరీక్షించిన వైద్యులు ప్రభాకర్‌కు చెప్పారు. దీంతో కోడూరుపాడు గ్రామ శివార్లలోని గుడి వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రభాకర్ కుమారుడు శ్రీకాంత్ బైక్‌పై చేపలు అమ్ముకుంటూ అటుగా వెళ్తూ తండ్రిని గమనించాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ప్రభాకర్‌ను జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ప్రభాకర్ మృతిచెందాడు. శ్రీకాంత్ బుధవారం నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి..

పొదలకూరు: నెల్లూరు రూరల్ మండలం ఎల్లంటి గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు పొదలకూరు మండలం బత్తులపల్లి గ్రామంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. నాగయ్య (75) మంగళవారం రాత్రి బత్తులపల్లిలోని బంధువుల ఇంటికెళ్లాడు. అక్కడ పురుగు మందు తాగడంతో వారు నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నాగయ్య మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గాంధీ జయంతి రోజున నాటుసారా విక్రయాలు

- ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు
- ఏడు లీటర్ల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): నాటుసారా విక్రయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు చేసి ఏడు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. వారి కథనం మేరకు.. గాంధీ జయంతి సందర్భంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏసీ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వైవీ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి నెల్లూరు నగరంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. హరనాథపురంలో యాకోబు అనే వ్యక్తి నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా డ్రైడే కావడంతో బోగోలు నుంచి నాటుసారా తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు వెల్లడించడంతో అరెస్ట్ చేశారు. యాకోబు నుంచి ఏడులీటర్ల నాటుసారా, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై కాలేషావలీ, హెడ్‌కానిస్టేబుళ్లు ఎ.రమేష్‌కుమార్, ఎం.కిరణ్‌సింగ్, కానిస్టేబుళ్లు తులసీదాస్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ఇసుక ట్రాక్టర్లు

ఆత్మకూరు: అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా పెన్నానది, బొగ్గేరుల నుంచి ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను సీఐ గంగాధర్, ఎస్సై జిలానీలు బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. మండలంలోని జంగాలపల్లి బొగ్గేరు నుంచి ఇసుక తరలిస్తున్న 4 ట్రాక్టర్లను, అదే క్రమంలో బండారుపల్లి పెన్నానది నుంచి ఆత్మకూరుకు ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.